నీటి సరఫరా చేయాలి



వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

మణికొండ: పది రోజులుగా నీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, జలమండలి అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని 16వ వార్డు ప్రజలు వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే మరికొన్ని రోజుల్లో రంజాన్ మాసం మొదలవుతుందని, అప్పుడు మరింత ఇబ్బంది అవుతుందని, సమస్యను గుర్తించి త్వరగా పరిష్కరించాలన్నారు. జలమండలి సిబ్బందికి పలు మార్లు ఫోన్లు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. వైస్ చైర్మన్ స్పందిస్తూ జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అరకొరగా ఆర్టీసీ బస్సులు!

- అంతంతమాత్రంగానే నడుస్తున్న సర్వీసులు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న వైనం

శంషాబాద్ రూరల్: అరకొరగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని వివిధ గ్రామాలకు గతంలో కంటే బస్సు సర్వీసుల సంఖ్య చాలావరకు తగ్గిపోవడంతో ప్రజలు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. నిత్యం విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు, రైతులు నగరంతో పాటు శంషాబాద్ పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వారికి సరిపడా బస్సులు మాత్రం నడపడం లేదు. రామంజాపూర్, పాల్మాకుల, పెద్దగోల్కొండ మార్గాల్లో ఉన్న గ్రామాల నుంచి నడిచే బస్సు సర్వీసులు తగ్గిపోయాయి. కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ విధించిన తర్వాత బస్సులను సగానికి పైగా రద్దు చేశారు.మళ్లీ వాటిని పునరుద్ధరించకపోవడంతో ప్రజలు సొంత, ప్రైవేట్ వాహనాలపై ప్రయాణాలు చేస్తున్నారు.



ప్రైవేట్ వాహనంలో వెళ్తున్న విద్యార్థులు

కాలి నడకే దిక్కు..

బస్సు సౌకర్యం లేని గ్రామాల నుంచి విద్యార్థులు ప్రతిరోజూ కాలినడకన పాఠశాలలకు వెళ్తున్నారు. సరైన వేళల్లో బస్సు సౌకర్యం లేక అలీకోట్‌తండా నుంచి రోజూ 50 మందికి పైగా విద్యార్థులు పెద్దషాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలకు కాలినడకన వెళ్లి వస్తుంటారు. వివిధ గ్రామాల నుంచి నర్కూడ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ ముగిసిన తర్వాత కూడా బస్సుల కోసం గంటల తరబడి రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తుంది. సుల్తాన్‌పల్లి, కవ్వగూడ విద్యార్థులు కూడా కాలినడకతో వెళ్తుంటారు.

బస్సు షెల్టర్లు కరువు..

ఆయా మార్గాల్లో బస్సు షెల్టర్లు కూడా లేవు. ఎండకు, వానకు ప్రయాణికులు తంటాలు పడుతున్నారు. కాచారం, నర్కూడ, రాళ్లగూడ ఇందిరానగర్, పాల్మాకుల, మదన్‌పల్లి, పెద్దషాపూర్, గండిగూడ బస్టాప్‌ల్లో షెల్టర్లు లేక ప్రయాణికులు బస్సుల కోసం చెట్ల నీడన వేచి ఉండాల్సి వస్తుంది. మరోవైపు ఘాంసిమియాగూడ వద్ద బస్సు షెల్టరు ఉన్నా నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సుల సక్రమంగా నడిపించాలని కోరుతున్నారు.

అనాథలకు విద్యా‘దానం’

- టెంట్ హౌజ్ యజమాని మురళి ఉదారత
- 150 మందికి పైగా విద్యార్థుల ఫీజు చెల్లింపు

శంషాబాద్: అన్నిదానాల్లో కన్నా విద్యాదానం గొప్పది. అలాంటి విద్యను నిరుపేద విద్యార్థులకు అందిస్తూ అండగా ఉంటున్నాడు.. పట్టణంలోని పాత శంషాబాద్ రహదారిలో టెంట్ హౌజ్ వ్యాపారం నిర్వహించే మురళి. చిన్నవయస్సుల్లో పెద్ద బాధ్యతలు ఎత్తుకొని ఆదర్శంగా నిలుస్తున్నాడు. తల్లిదండ్రులు కోల్పోయిన వారితో పాటు తల్లి లేదా తండ్రిని కోల్పోయి చదువుకోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నావారికి నేనున్నానంటూ చేయూతనందిస్తున్నారు.

ఆరేళ్లుగా..

తల్లి లేదా తండ్రిని కోల్పోయిన లేదా తల్లిదండ్రులు లేనివారి ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థుల వివరాలను సొంతంగా కళాశాలల నుంచి సేకరిస్తున్నాడు. ఇందులో ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల అన్నిరకాల ఫీజులతో పాటు ఇతర ఖర్చులు కూడా చెల్లిస్తున్నాడు. ఆరేళ్లలో ఇప్పటివరకు సుమారు 150 మంది విద్యార్థులు మురళి అందించిన ఆర్థిక చేయూతతో చదువులు పూర్తి చేసుకున్నారు. ఈ ఏడాది నాలుగు కళాశాలల్లో ఉన్న మొత్తం 30 మందికి పైగా విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటును అందించాడు.



ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న వ్యాపారి మురళి

నిరంతరం కొనసాగిస్తా..



నిరుపేద విద్యార్థుల చదువుకు పెట్టే ఖర్చు వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. మరే దానం దీని కంటే గొప్పది కాకపోవొచ్చనేది నా అభిప్రాయం.తల్లీతండ్రి కోల్పోయిన వారి మానసిక పరిస్థితులు వేరుగా ఉంటాయి. చదువుకునేందుకు వారు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకే నేను ఆయా కళాశాలలకు వెళ్లి వారి వివరాలు సేకరిస్తున్నా. వారి చదువుకు సంబంధించిన ఫీజులు ఇతరత్రా ఖర్చులన్నీ అందిస్తున్నా. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తా.

– మురళి, వ్యాపారి

నాలాంటి వారికి సాయం చేస్తా..



మా నాన్న చనిపోయాడు. దీంతో చదువుకునేందుకు చాలా ఆర్థిక ఇబ్బందులు పడ్డాను. నా ఇబ్బందులు తెలుసుకొని అన్న సాయం చేస్తున్నాడు. మంచిగా చదివి భవిష్యత్‌లో నాలాంటి వారికి సాయం చేయాలని ఉంది.

– బి. మనోజ్‌గౌడ్, ఇంటర్ ప్రథమ సంవత్సరం

ఫీజు చెల్లిస్తున్న విషయం తెలియదు



మా నాన్న చనిపోయాడు. మా ఫీజులకు సంబంధించి వివరాలను మురళి అన్న తెలుసుకుని డబ్బులు చెల్లించే విషయం ఇప్పటికీ నాకు తెలియదు. ఆర్థికంగా ఆదుకున్నందుకు ధన్యవాదాలు. నాలాంటి వారికి చాలామందికి చెక్కులు అందజేశారు.

– ప్రీతి, విద్యార్థిని, ఇంటర్ ప్రథమ సంవత్సరం

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు



నార్సింగి గురుకుల కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయమే సెంటర్లకు చేరుకున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. లేటుగా వచ్చిన విద్యార్థులను సిబ్బంది లోనికి పంపించలేదు. సిటి తపస్య కాలేజీలో పరీక్షా పత్రం 15 నిమిషాలు ఆలస్యంగా వచ్చింది.

దీంతో నిర్వాహకులు 9.15కు పరీక్షలను ప్రారంభించి మధ్యాహ్నం 12:15 వరకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. పరీక్షల నేపథ్యలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎగ్జామ్ రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

గండిపేట పరిధిలో..


మణికొండ: గండిపేట పరిధిలోని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి తనిఖీలు నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



జలమండలి అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని జలమండలి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఇబ్బందుల్లేకండా చూడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని వెస్టెండ్ కాలనీలో హెచ్‌ఎండబ్ల్యూఎంఎస్‌ఎస్‌బీ కార్యాలయంలో జలమండలి అధికారులు, వాటర్ లైన్‌మెన్లతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మెయిన్ లైన్ నుంచి వచ్చే నీరు గోల్డెన్ హైట్స్, పీడీపీ చౌరస్తా, పిల్లర్ నంబర్ 102 నుంచి వచ్చే నీరు తగ్గి సకాలంలో అందడం లేదన్నారు. దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో టెక్నికల్ అధికారి ఏల్లమయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, రాములు, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నారమ్స్‌లో సైన్స్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

నారమ్స్‌లో జాతీయ సైన్స్ డే వేడుకలు





విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నారమ్స్)లో జాతీయ సైన్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తాపూర్‌లో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు నారమ్స్ క్యాంపస్ లోని పలు వ్యవసాయ రంగానికి చెందిన క్షేత్రాలను చూసేందుకు అవకాశం కల్పించారు.

ఎంజీఐటీలో..

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గడీఎంఆర్‌ఎల్ విశ్రాంత సైంటిస్ట్ అశోక్‌కుమార్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశోధనలు దేశ సమగ్రతకు పెంచుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు విజ్ఞానం పెంచుకోవాలని, సైన్స్‌పై ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. నిత్య జీవితంలో సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్తాపూర్ కృష్ణవేణి బ్రాంచ్‌లో..

అత్తాపూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్‌ఫేర్ ఎంతగానో ఉపయోగపడుతుందని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ శ్రీధర్ అన్నారు. అత్తాపూర్ కృష్ణవేణి బ్రాంచ్‌లో ప్రిన్సిపాల్ మహేశ్వర్ రెడ్డి సమక్షంలో విద్యార్థులనుద్దేశించి బుధవారం మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు సైన్స్ ఫేర్‌లో ప్రత్యక్షంగా పాల్గొని జ్ఞానాన్ని మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. అంతరిక్షంలో రాకెట్ పనితీరు టెక్నాలజీకి అనుగుణంగా మార్పులు, చేర్పులు నూతన సాంకేతిక రంగానికి శ్రీకారం చూడుతున్న శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు, గర్భస్థ శిశువు ఎదుగుదల తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి ఇష్టమైన విద్యనే అభ్యసించేలా తల్లిదండ్రులు చూడాలని కోరారు.



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ మౌనిక

శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో..

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్ ఫేర్ నిర్వహించారు. ఇందులో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా పలు వినూత్నమైన కార్యక్రమాలు చేశారు. అదేవిధంగా రానున్న రోజుల్లో ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. ఏ నిబంధనలతో ఉండాలి.. మంచి, చెడు ఎలా ఉంటుంది అని విద్యార్థులకు ప్రిన్సిపాల్ పుష్ప వివరించారు. ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎస్‌ఐ మౌనిక హాజరై ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇవి ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ హాస్పిటల్ డాక్టర్ మోహీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ దినోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న విశ్రాంత శాస్త్రవేత్త అశోక్‌కుమార్ సింగ్

ఆక్రమణలు తొలగించండి

మణికొండ: నెక్నాంపూర్ చెరువులో ఆక్రమణలు, గుర్రపు డెక్క పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాలని మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ కౌన్సిలర్ బి. పద్మారావు కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రైవేట్ పాఠశాల ప్రారంభోత్సవానికి వచ్చిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. దాంతో డిప్యూటీ సీఎం స్పందిస్తూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నైపుణ్యమైన శిక్షణ అవసరం

బండ్లగూడ: నైపుణ్యవంతమైన శిక్షణ ఎంతో అవసరమని అపెక్స్ ఆన్ ఇండియా సీఈవో వంశీ కోర అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో అపెక్స్ ఆన్ ఇండియా సౌజన్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. చీఫ్ డేటా అనలిస్ట్ ఆఫీసర్ వంశీకోర, సీనియర్ లీడ్ వెంకటస్వామి, సీనియర్ డాటా ఇంజినీర్స్ బృందంతో కలిసి బుధవారం ఈ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు చక్కటి సాంకేతిక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శిక్షణ పొందుతున్న వారు మంచి మెళకువలు నేర్చుకుంటే అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. విద్యా రంగంలో శివ మందిరాలతో కలిసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తు అంతం నైపుణ్యత మీదనే ఆధారపడి ఉందని, నైపుణ్యం గల యువతను అనేక సంస్థలు కోరుకుంటున్నాయని విస్తృత అవకాశాలు ఉన్నాయని సూచించారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శిస్తున్న అపెక్స్ ఆన్ ఇండియా సీఈవో వంశీ కోర

రవీంద్రభారతీలో ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ సైంటిస్టులు

శంషాబాద్: ప్రపంచ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతీ పాఠశాలలో బుధవారం సైంటియా సైన్స్‌ఎక్స్‌పో పేరిట వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. మనోజ్ , సైంటిస్టులు డాక్టర్ ఎస్.ఏ హుస్సేన్, డాక్టర్ అమీర్ భాషా, రవీంద్రభారతీ పాఠశాలల డీన్ ప్రియామనీశ్ పాల్గొని తిలకించారు. విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో ప్రతి అంశం సైన్స్‌తో ముడిపడే ఉంటాయన్నారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచనాత్మకంగా ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిషా తన్వీర్, సూపర్‌వైజర్ మధు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సీబీఐటీ లోగోతో విద్యార్థులు

సీబీఐటీలో శృతి-2024 ఉత్సవాలు షురూ

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో వార్షికోత్సవ సందడి శృతి-2024 ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి పరేడ్ కాస్ పేట్ల, టైమ్ వార్ప్ ఫియాస్టా, ఫొటో స్టోరీ, శృతి ఐడల్, బ్లూస్ క్లూస్ లాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు హుషారుగా పాల్గొన్నారు. గురువారం శ్రీ, శ్రీమతి శృతి, యుఫక్షనీ, ముషైరా, డోర్డియాలేమా, ఫొటోహంట్, రైట్ యాంగిల్, సాహిత్య కార్యక్రమాలతో పాటు క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తెలిపారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ రాంపుల్లారెడ్డి, గౌరవ అతిథిగా బాడీ బిల్డర్ రామకృష్ణ హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.



ఉత్సవాల్లో హుషారుగా పాల్గొన్న విద్యార్థులు

రైస్ గోదాంపై విజిలెన్స్ అధికారుల దాడులు

మైలార్‌దేవ్‌పల్లి: అనుమతుల్లేకుండా రైస్ గోదాం నిర్వహిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ అధికారులు మైలార్‌దేవ్‌పల్లి టాటానగర్‌లోని ఓ గోదాంపై బుధవారం దాడులు చేసి బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పీడీఎస్ రైస్ నిల్వలు ఉన్నాయనే సమాచారంతో తనిఖీలు నిర్వహించామన్నారు.ఇతర రాష్ట్రాల నుండి బియ్యాన్ని తీసుకువచ్చి అనేక రకాల బ్రాండ్‌లతో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఆ బియ్యం శాంపిళ్లను సేకరించామని, ల్యాబ్‌కు పంపిస్తే 24 గంటల్లో రిపోర్ట్ వస్తుందని తెలిపారు. అనుమతులు ఉన్నట్లు పత్రాలు చూపించారని పేర్కొన్నారు. పీడీఎస్ రైస్ అని తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రైస్ గోదాంను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు